క్లుప్తంగా

నో పార్కింగ్ అయినా సరే..!



నో పార్కింగ్ అని బోర్డు ఉన్నప్పటికీ బైకులు బారులు తీరాయి. పోలీసులు ఏం చేస్తున్నారని ఆలోచిస్తున్నారా? ఈ బోర్డు ఉన్నది ఎక్కడో కాదు సాక్షాత్తు పోలీస్ కమిషనరేట్‌లోనే అంటే నమ్ముతారా. ఆదివారం రికవరీ మేళా సందర్భంగా నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైకులను బాధితులకు అప్పగించేందుకు ఇలా లైన్‌గా నిలబెట్టారు.

– సాక్షి ఫోటోగ్రాఫర్

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం

దాబాగార్డెన్స్ : రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ నూతన కార్యవర్గ స్థాపన ఆదివారం నగరంలోని ఓ హోటల్లో జరిగింది. 2024–25 ఏడాదికి సంబంధించి క్లబ్ అధ్యక్షుడిగా మహ్మద్ యాసీన్, కార్యదర్శిగా చింతా నేతాజీ బాధ్యతలు చేపట్టారు. స్థాపన అధికారిగా పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్ కిషోర్‌కుమార్ వ్యవహరించారు. విశాఖపట్నం ఎంపీ భరత్, జాన్సన్ కంట్రోల్స్ ఇటాచి కంపెనీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట ఎస్. వాసుదేవన్ స్థాపన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను అభినందించారు. రోటరీ క్లబ్ సేవలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ యాసీన్, చింతా నేతాజీ మాట్లాడుతూ ఇప్పటి వరకు విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహించిన పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు పి. నాగరాజు, బి. శంకరరావు ఇతర సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన సారథ్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని, ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ, నిరుపేద చిన్నారుల చదువుకు ఆర్థిక సాయం, ఉచిత ఆరోగ్య శిబిరాల వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు.

భక్తిశ్రద్ధలతో హరనాథుని జయంతి



ఏకాహం చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్ : రాజీవ్‌నగర్ కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీచే ఆదివారం హరనాథుని జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో గల కుసుమ హరనాథ దివ్య మంగళ మూర్తులను పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు, కుసుమకుమారిదేవికి కుంకుమార్చనలు జరిపారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. షోడశాక్షరి నామంతో 24 గంటలు ఏకాహం చేపట్టారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు బీవీ బాబాజీ, కార్యదర్శి ఆర్‌వీఎస్ రమేష్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి కె. మంగరాజు, కోశాధికారి ఎస్. అన్నాజీరావు, ఆశ్రమ ప్రతినిధులు శివ, సీతారాం, నాని, కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

30 ఏళ్ల ఉద్యమ స్ఫూర్తి

అల్లిపురం : ఎంఆర్‌పీఎస్ ప్రస్థానంలో మంద కృష్ణ మాదిగ విజయాలు కోకొల్లలు అని విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు చెవ్వేటి అప్పారావు అన్నారు. మంద కృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా ఆదివారం సాయంత్రం కొబ్బరితోటలో గల శ్రీ నూకాంబిక సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు యాణంగి వేణు, డి.ప్రసాదరావు, ఆర్.అప్పారావు, ఆర్.చిన్న, టి.కనకరాజు, పి.శ్రీను, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



నెరెళ్లకోనేరులో ఉత్కళ్ సమాజ్ ఆధ్వర్యంలో రథం లాగుతున్న భక్తులు



వేడుకలో మహిళల కోలాటం

శోభాయమానం

- జగన్నాథ రథోత్సవం సందర్భంగా వెల్లువలా తరలి వచ్చిన భక్తులు
- కిక్కిరిసిపోయిన రహదారులు

జగన్నాథ రథయాత్ర సందర్భంగా దక్షిణ నియోజకవర్గం ఆదివారం ఆధ్యాత్మిక శోభతో వెలుగులు విరజిమ్మింది. స్వామి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ అందజేశారు. రథయాత్ర సందర్భంగా రహదారులు కిక్కిరిసిపోయాయి. అన్ని దారులు రథయాత్రకే అన్నట్లు భక్తులు స్వామి చెంతకు సాగిపోతూ కనిపించారు.



రథయాత్రకు కంచరవీధి ఎంబర్‌మన్నార్ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సిద్ధం చేస్తున్న అర్చకులు

దాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గం ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. నియోజకవర్గ పరిధి టౌన్ కొత్త రోడ్డులో వెలసిన జగన్నాథస్వామి ఆలయం నుంచి ఓ రథం టర్నర్ చౌల్ట్రీకి బయలుదేరగా, పాతనగరం కంచరవీధి ఎంబర్‌మన్నార్ దేవాలయం నుంచి మరో రథం టర్నర్ సత్రం వరకు యాత్రగా సాగింది. ఇదిలా ఉండగా బౌడారా రోడ్డులోని ఒరియా బ్రాహ్మిణ్స్ ఆధ్వర్యంలో అల్లిపురం, ఏడుగుళ్లు, బౌడారా రోడ్డు, స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల గుండా స్వామి రథయాత్ర సాగింది. జిల్లా పరిషత్ సమీపాన గల శ్రీకృష్ణుని ఆలయం నుంచి రథయాత్ర పలు జంక్షన్ల మీదుగా కదిలింది. సంకీర్తనలు.. కోలాటాలు.. భజనలు.. విష్ణు సహస్ర నామ పారాయణ.. వేదమంత్రాలు.. మంగళధ్వనితో యాత్ర పులకించింది. దక్షిణ నియోజకవర్గం ఆహ్లాదకర వాతావరణం సంతరించుకుంది. ఎక్కడ చూసినా భక్తుల సందడే. ఎటు చూసినా ట్రాఫిక్కే. గల్లీలు.. రహదారులు వాహనాలతో నిండిపోయాయి. ఉచిత ప్రసాదాలు.. మజ్జిగ పంపిణీలకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి.

కంచరవీధి నుంచి..

పాతనగరం కంచర వీధిలో గల ఎంబర్‌మన్నార్ దేవాలయం నుంచి రథం బయలుదేరింది. అక్కడి నుంచి బురుజుపేట, సీతారామస్వామి ఆలయం, కనకమహాలక్ష్మి ఆలయం, రీడింగ్ రూమ్ మీదుగా టౌన్ కొత్తరోడ్డు వరకు సాగింది. అనంతరం టౌన్ కొత్తరోడ్డు నుంచి ప్రారంభమైన రథయాత్రకు కలిపారు.

బౌడారా రోడ్డులో..

బౌడారా రోడ్డులో ఒరియా బ్రాహ్మిణ్స్ ఏర్పాటు చేసిన రథం అల్లిపురం, ఏడుగుళ్లు, నేరెళ్ల కోనేరు, స్టేషన్ రోడ్డు, బీఎస్‌ఆర్ జంక్షన్ తదితర ప్రాంతాల మీదుగా సాగింది.

జిల్లా పరిషత్ కృష్ణ మందిరం నుంచి..

జిల్లా పరిషత్ జంక్షన్‌లో గల కృష్ణ మందిరం నుంచి పెద్ద ఎత్తున రథయాత్ర ఉత్సవం సాయంత్రం సాగింది. బీచ్ రోడ్డు, కృష్ణానగర్, జిల్లా పరిషత్ జంక్షన్ తదితర ప్రాంతాల గుండా రథయాత్ర సాగింది.



టౌన్ కొత్తరోడ్డులో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

ఉత్కల్ సమాజ్ ఆధ్వర్యంలో..

అల్లిపురం : నేరెళ్లకోనేరు ఉత్కల్ సమాజ్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామికి విశేష పూజలు జరిపారు. అనంతరం రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూరీ క్షేత్రంలో నిర్వహించిన విధంగానే అల్లిపురం నేరెళ్లకోనేరులో కూడా రథయాత్ర నాలుగేళ్లుగా నిర్వహిస్తున్నారన్నారు. అక్కడి సంప్రదాయాలను పాటిస్తూ ప్రతి ఏడాది యాత్ర చేపడుతున్నారన్నారు. అనంతరం నేరెళ్లకోనేరు నుంచి గోకుల్ థియేటర్, ఎస్‌ఆర్‌ఎంటీ, చలువతోట, సింహాలదేవిడి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్‌రోడ్డు మీదుగా యాత్ర తిరిగి నేరెళ్లకోనేరుకు చేరుకుంది. అనంతరం స్వామి వారిని ఆలయంలో అధిష్ఠింపజేసి అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఒడిశా సాంప్రదాయ నృత్యాలు, కోలాటాలు నిర్వహించారు.



రథంపై విశేష అలంకరణలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి

ప్రథమ చికిత్సపై అవగాహన తప్పనిసరి



ప్రథమ చికిత్సపై శిక్షణ ఇస్తున్న మహ్మద్ రహ్మతుల్లా

మహారాణిపేట : ప్రథమ చికిత్స పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని రెడ్ క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ వై. శివనాగేంద్రరెడ్డి తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో శివనాగేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రథమ చికిత్స చేసే వారికి ఉండవలసిన లక్షణాలు, మానవ శరీరంలో ముఖ్య అవయవాలు, సీపీఆర్ ప్రక్రియ, నీటిలో మునిగిన వారికి చేసే చికిత్స, గుండె పోటు, వడదెబ్బ, మధుమేహం, జ్వరం, కలరా, డయేరియా, మూర్ఛ, విష ప్రయోగం, గాయాలకు కట్లు కట్టడం, రక్తస్రావం, పాలబారటం, కాలిన గాయాలు, కరెంట్ షాక్, పాము, తేలు కాటు సమయంలో విషం విరుగుటకు అందించాల్సిన తక్షణ ప్రథమ చికిత్సల గురించి అవగాహన కల్పించారు. అలాగే ప్రమాద సమయంలో క్షతగాత్రులను తరలించే పద్ధతి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో అందించాల్సిన ప్రథమ చికిత్స పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో 30 మందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిక్షకుడు మహ్మద్ రహ్మతుల్లాను శివనాగేంద్రరెడ్డి అభినందించారు. అనంతరం శిక్షణలో ఉత్తీర్ణులైన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ కార్యదర్శి పి.రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం విజయనగరానికి చెందిన పి. వెంకట శోభా చలపతిరావు, విజయ భారతి దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మేరకు సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో దేవస్థానం తరపున పీఆర్వో అప్పలనాయుడు దాతకు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు. దేవస్థానం ఉద్యోగి సాంబ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థలో అన్నదానం



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు



వైఎస్సార్ అభిమాని రామకృష్ణ

దాబాగార్డెన్స్ : మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని కువైట్‌లో ఉపాధి పొందుతున్న నగరానికి చెందిన వేగి రామకృష్ణ ఆదివారం నగరంలోని పాత పోస్టాఫీస్ సమీపాన గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో వృద్ధులు, పేదలకు అన్నసమారాధన నిర్వహించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా మహానేత వైఎస్సార్ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, సంస్థ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ఫోన్‌లో తన అభిప్రాయం వ్యక్తం చేశారు. పేదల ముఖాల్లో చిరునవ్వు కోసం వైఎస్సార్ నిత్యం తాపత్రయపడేవారని, తండ్రి ఆశయ సాధనకు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా స్నేహితుల ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు, యాసీన్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ వార్ అదుర్స్



వెస్ట్రన్ డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు



విజేతలతో మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహమ్మద్ షకీల్

సీతంపేట: చిన్నారులు తమ టాలెంట్‌తో అదరగొట్టారు. సోలో, గ్రూప్ డ్యాన్స్‌లతో, సింగింగ్‌తో ప్రతిభ చూపించారు. మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహమ్మద్ షకీల్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో రెండు రోజుల పాటు టాలెంట్ వార్ పేరిట జరిగిన పోటీలకు ఆదివారం విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చాటారు. నాలుగేళ్ల నుంచి 25 ఏళ్ల వయసు గల పలువురు క్లాసికల్, ఫోక్, వెస్ట్రన్ డ్యాన్స్, సింగింగ్, మ్యూజిక్‌లో పోటీ పడ్డారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, ధ్రువపత్రాలను అందజేశారు.

వైభవంగా షోడస నామ పూజ



ముత్తయిదువుల పూజలో పాల్గొన్న భక్తులు



విశేష అలంకరణలో వారాహి అమ్మవారు

అల్లిపురం : శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అల్లిపురంలోని సాయిదర్బార్‌లో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సాయి శ్రీ మేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా ఆదివారం షోడసనామ పూజ వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా 16 మంది ముత్తయిదువులకు అంగాంగ పూజ, షోడసనామ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ముత్తయిదువుల కాళ్లకు పసుపు రాసి, పూలతో పూజించారు. సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో అమ్మవారి హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రసన్న, కార్యదర్శి పి.శ్రీనివాస సుబ్రహ్మణ్యశాస్త్రి, ట్రస్టీలు స్వప్నప్రియ, పద్మజ, పద్మావతి, గ్రంధి రమ, రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

కంచరపాలెం : జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢ శుద్ధ విదియ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పీఎంపాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. నగరంలోని శ్యామల కూచిపూడి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుత నృత్యాలతో అలరించారు. గణపతి స్తుతి గీతానికి చేసిన నృత్యంతో కార్యక్రమం ప్రారంభం కాగా కళాకారులు దీక్షిత, స్నిగ్ధ ప్రమిదలో వెలిగించిన దీపాలు చేతబూని ఘటాలపై ప్రదర్శించిన నృత్యాభినయాలు కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచాయి. కళాకారులు మోక్షిత, సత్యవర్షిణి, రిషిత, జోషిత, శృతి, శ్రీజ, సహస్ర, అంజని, సమన్వి, కుందన ప్రియ, విద్య, ప్రణతి, లాస్య, శ్రావణి, దీక్షిత, చాందిని నృత్యాలతో ఆకట్టుకున్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

సీతంపేట: సమాజంలో బ్రాహ్మణుల మనుగడకు అందరం కలిసికట్టుగా పని చేద్దామని వివిధ వర్గాలకు చెందిన బ్రాహ్మణ ప్రముఖులు పిలుపునిచ్చారు. వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యువ రాజకీయ వేత్త ద్రోణంరాజు శ్రీవత్సవ్ మాట్లాడుతూ సమాజంలో అందరూ బాగుండాలని కోరుకునే వారిలో మొదటి వారు బ్రాహ్మణులేనని, అలాంటి వారు నేడు దుర్భర స్థితిలో ఉన్నారన్నారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్యా, వ్యాపార రంగాల్లో బ్రాహ్మణుల ఎదుగుదలకు అవరోధం కలిగించే శక్తులు ఎన్నో ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయి కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. న్యాయవాది కె.వి.నరసింహమూర్తి మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ భవన్‌కు కొంత స్థలాన్ని కేటాయించగా.. దానికి కంచె వేశామన్నారు. బ్రాహ్మణ సంఘాల పేరిట ఇవ్వాల్సిన ఆ స్థలాన్ని బ్రాహ్మణ కార్పొరేషన్, దేవదాయ శాఖ సంయుక్త పేరిట ఇవ్వడంతో దానికి క్లియరెన్స్‌లో జాప్యం జరిగిందని చెప్పారు. ఏపీ బ్రాహ్మణ ఐక్య వేదిక కన్వీనర్ సీవీఎస్ సాయిరామ్, వైద్యులు విజయశేఖర్, వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావూరి చరణ్, సంస్థ గౌరవాధ్యక్షులు టీఎస్సార్ ప్రసాద్, వివిధ సంఘాల ప్రతినిధులు నెమ్మలూరి శివగణేష్, దివాకర్, హనుమంతరావు, మహంతి, డాక్టర్ వాణి తదితరులు భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

'డిమాండ్స్ డే' విజయవంతం చేయండి



కరపత్రం ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

దాబాగార్డెన్స్ : కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు కొనసాగించడాన్ని నిరసిస్తూ ఈ నెల 10న పని ప్రదేశాల్లో డిమాండ్స్ డేలో పాల్గొని విజయవంతం చేయాలని సిటు విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి మూడోసారి వచ్చినా మెజార్టీ లేదన్నారు. 2024 ఎన్నికల్లో బీజేపీకి కార్మికులు గట్టిగా బుద్ధి చెప్పినా, మోదీ మొండికేసి కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను ఎలాగైనా అమలు చేయాలని పూనుకుంటున్నారని ఆరోపించారు. దీనిలో భాగంగానే కార్మికుల అకౌంట్స్‌కు ప్రావిడెంట్ ఫండ్ యాజమాన్యం సకాలంలో చెల్లించకపోతే 25 శాతం పెనాల్టీ ఉండేదని, ప్రస్తుతం ఒక శాతానికి మోదీ ప్రభుత్వం తగ్గించిందన్నారు. ఇది కార్మికులకు తీవ్ర నష్టం చేస్తుందన్నారు. కార్మిక లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపి, సొంత గనులు కేటాయించాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం నేషనల్ హెల్త్ మిషన్ తదితర ప్రభుత్వ స్కీమ్స్‌లో పని చేస్తున్న కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎస్. జ్యోతీశ్వరరావు, ఎం. సుబ్బారావు, యు. రామస్వామి, యు. రాజు, పి. మణి, పి. వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 18 నుంచి కనకమ్మ జాతర

మద్దిలపాలెం : పాత వెంకోజీపాలెం గ్రామ దేవత శ్రీకనకమ్మ అమ్మవారి జాతర వచ్చేనెల 18వ తేదీ నుంచి నిర్వహించాలని గ్రామ సేవా సంఘాలు నిర్ణయించాయి. శ్రీసీతారామ సేవా సంఘం, శ్రీరాధాకృష్ణ యాదవ సంఘం, శెట్టి బలిజ సేవా సంఘం ఈ మేరకు ఆదివారం సమావేశమై జాతర తేదీలను ఖరారు చేశాయి. 18న చాటింపు, 19న తొలేళ్ల, 20న అమ్మవారి ప్రధాన జాతర జరగనున్నాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. పాత వెంకోజీపాలెం శ్రీరాధాకృష్ణ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఒమ్మి ముత్యాలరాజు, ఉపాధ్యక్షుడిగా పల్లా పెంటారావు, ప్రధాన కార్యదర్శిగా ఒమ్మి కోటి, తదితరులు ఎన్నికయ్యారు.

నూకాలమ్మను దర్శించుకున్న ఆశ్రమవాసులు



నూకాంబికా అమ్మవారి సన్నిధిలో వివేకానంద ఆశ్రమ వాసులు

దాబాగార్డెన్స్ : అనకాపల్లి నూకాలమ్మను స్వామి వివేకానంద ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న పలువురు వృద్ధులు దర్శించుకున్నారు. ఆశ్రమ వాసులను నెలకోసారి దేవాలయానికి, సాగరతీరానికి, లేదా ఆధ్యాత్మిక సినిమాల కు తీసుకెళ్లి ఆనందపరచడం ఆనవాయితీ అని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపా రు. దీనిలో భాగంగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దర్శనం చేయించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆశ్రమ వాసులతో పాటు సంస్థ సభ్యుడు వి. దానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏబీఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పైలా



ఆదిమోహన్‌రెడ్డి

దాబాగార్డెన్స్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) రాష్ట్ర అధ్యక్షుడిగా నగరానికి చెందిన పైలా ఆదిమోహన్‌రెడ్డి నియమితులయ్యారు. చీరాలలో ఆదివారం జరిగిన ఏబీఏపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో 2024–26కు సంబంధించి రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రచార సభ జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాసు తెలిపారు. ఈ మేరకు ఆదిమోహన్‌రెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. అధ్యక్షుడితో పాటు 25 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదిమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేయడానికి కృషి చేస్తానన్నారు.